**తిమ్మాపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి శంకుస్థాపన...**



5లో


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd


**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి...**



5లో


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 287 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- శనివారం 12 అక్టోబర్ 2024







దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





ప్రజలకు.. విజయ దశమి(దసరా) శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 287 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 07 రూ - 03/- శనివారం 12 అక్టోబర్ 2024


# గత ప్రభుత్వం 5వేల పాఠశాలలు మూసివేసింది: సీఎం రేవంత్‌రెడ్డి



**కొందుర్గ్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్య సదుపాయాలను మెరుగుపరిచి ఆరోగ్య తెలంగాణను ఆవిష్కరిస్తామన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్ భవనాన్ని రూ.25 కోట్లతో 150 ఎకరాల్లో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. చదువుకున్న విద్యార్థుల కొలువుల గురించి కేసీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. పేదలంతా గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని విమర్శించారు."కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ, ఇది పేదల ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు సున్నా సీట్లు వచ్చినా.. వారి ఆలోచనా విధానం మారలేదు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ఎక్కడా సరైన భవనాలు నిర్మించలేదు. పేద విద్యార్థులు, చదువుకునే బడులు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదు. భారాసకు మాత్రం 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారు. చదువుకునే విద్యార్థులను కూడా కేసీఆర్ కులాల వారీగా విభజించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరుగా గురుకులాలు పెట్టారు. గత ప్రభుత్వం 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో టీచర్లలో అసహనం ఏర్పడింది. ఈ ప్రభుత్వం 21వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ఒక నమ్మకం కలిగించింది" అని సీఎం వివరించారు.

# హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు: కిషన్‌రెడ్డి



**కొందుర్గ్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** అర్టికల్ 370 విషయంలో పునరాలోచన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. పదేళ్ల భాజపా పాలనలో భారతదేశం అంతర్జాతీయంగా బలపడుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని.. 40ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరు. పేద ప్రజల ఇళ్లను కూల్చేముందు వాళ్లతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసీలోనే కలుస్తోంది.. దానికి ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుంది? రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్న ప్రభుత్వం.. అ నిధులను ఎక్కడి నుంచి సమీకరిస్తుంది? కూల్చివేతల విషయంలో హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే బ్యాంకు రుణాలు ఎవరు చెల్లిస్తారు?" అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

# తెలంగాణకు కేంద్రం మొండిచేయి : మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు.గోదావరి పుష్కరాలకు తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపడంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కి రూ.100 కోట్ల నిధులు ఇచ్చింది.. కానీ తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా..ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు.లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు. ఎప్పటికైనా ఇంటి పార్టీ బీఆర్ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో సమగ్ర కులగణనపై ఉత్తర్వులు



**హైదరాబాద్, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు ఉత్తర్వుల్లో సీఎస్ శాంతికుమారి వెల్లడించారు.సర్వే బాధ్యత ప్రణాళికశాఖకు అప్పగించారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. **ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్...** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది. ఉపకులాల వారీగా ఎస్సీల వెనకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

# భారీగా పెరిగిన పసిడి ధరలు...

హైదరాబాద్ అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్): పండగ వేళ హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం (24) క్యారెట్ల (10) గ్రాముల గోల్డ్ ధర రూ.760 పెరిగి రూ.77,400 చేరింది. (22) క్యారెట్ల (10) గ్రాముల బంగారం రేటు రూ.700 పెరిగి రూ.70,950కి చేరుకుంది. కేజీ వెండి ధర రూ.2,000 పెరగడంతో రూ.1,02,000 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాల్లో దాదాపు ఇవే ధరలు ఉంటాయి.



## విద్యార్థులకు, తల్లిదండ్రులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు విజయదశమి శుభాకాంక్షలు...








న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ నాయకులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు..

# దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ ప్రతినిధి: అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ప్రజలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగన్మాత ఆశీస్సులతో నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. విజయాలను అందించే విజయ దశమిగా దసరా పండుగను ఒక్కోచోట ఒక్కో విధంగా దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దసరా రోజున పాలపిట్టను దర్శించి, జమ్మిచెట్టుకు పూజలు చేసి, జమ్మి ఆకును బంగారంలా పరస్పరం పంచుకొంటూ, పెద్దల ఆశీర్వాదాలను అందుకుంటూ, అలయ్ బలయ్ తీసుకొంటూ ప్రేమాభిమానాలను చాటుకోవడం ఎంతో గొప్ప సంప్రదాయమని చెప్పారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిని కలిసిన తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్ ఫోరం లింగంపల్లి రమేష్



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా: మానకొండూరు నియోజకవర్గం ప్రజాభవన్ లో శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ని తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్ ఫోరం మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ లింగంపల్లి రమేష్ కెడిసిసి బ్యాంక్ జిల్లా డైరెక్టర్ అలువాల కోటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మానకొండూర్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరి చేయించి భూమి పూజ గావించినందునకు శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ కి లింగంపల్లి రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల దండు కరీంనగర్ జిల్లా ఇన్చార్జిగా టేకు అనిల్



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల దండు కరీంనగర్ జిల్లా ఇన్చార్జిగా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన టేకు అనిల్ నియామకం అయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షులు చింతల రాజలింగం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టేకు అనిల్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాలతో నడుస్తూ అన్నివేళ కులస్తులకు అందుబాటులో ఉంటూ కుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో సిరిగిరి తిరుపతి, పత్తి అంజి, రాజయ్య, చంద్రయ్య, లింగమూర్తి, పోచయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆశలపై నీళ్లు

- దసరాకు కూడా మొండిచేయి చూపిన సర్కారు
- డీఏలకు మోక్షమెప్పుడో తెలియక ఆందోళన
- ఎన్నికల మేనిఫెస్టో హామీలకు మంగళం
- నైరాశ్యంలో ఎంప్లాయీస్, పెన్షనర్లు
- ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- ఉద్యమ కార్యాచరణ వైపు అడుగులు

**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 11(పిసి డబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం మమ్మల్ని మోసం చేయడమే. ఇచ్చిన మాట నిలుపుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. మేనిఫెస్టో చూసి మేమంతా కాంగ్రెస్ వైపు మొగ్గితే, ఏరు దాటినంక తెప్ప తగలేసినట్టు ఉన్నది మా కుటుంబాల పరిస్థితి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన రెండు డీఏలు కూడా చెల్లించకుండా పదకొండు నెలల నుంచి సతాయించడం దారుణం. అడిగినప్పుడల్లా ఇదిగో, అదిగో అంటూ దాటవేయడమే తప్ప, మాకు రావాల్సిన బకాయిలు చెల్లించాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతున్నది. సీనియర్ సిటిజన్లకు ఈ ప్రభుత్వ హయాంలో కనీస గౌరవం లేదు. వారి హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తున్నది. అంతంత మాత్రంగానే వస్తున్న పెన్షన్‌తో విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయని తెలంగాణ కార్మికుల, పెన్షనర్ల ఎగ్జిట్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు.



# ప్రజలకు.. విజయ దశమి(దసరా) శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 11(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. జగన్మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని అభిలాషించారు. ప్రతి ఒక్కరి ఆశలు ఫలించి, ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ విజయ దశమి అని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన రైతులు, యువత, వ్యాపారులు, మహిళలు ఇతర అన్నివర్గాల వారు బాగుండాలని ఎంపీ డా.కడియం కావ్య అమ్మవారిని ప్రార్థించారు.

## తెలంగాణ ప్రజలకు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు...

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్



**హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ దసరా మీకు బలం, సంకల్పం లభించాలని, మీరు చేసే ప్రతి పనిలో దుర్గాదేవి బలాన్ని, శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నామని, మీరు వెళ్లే ప్రతి మార్గంలోనూ మీకు విజయం దక్కాలని, ఆ అమ్మవారు తోడుగా నిలవాలని కోరుకుంటూ విజయ దశమి శుభాకాంక్షలను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ గౌడ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పండుగ యొక్క రంగులు లైట్ల మాదిరిగానే, మీ జీవితం ప్రపంచంలోని అన్ని ఆనందం, శ్రేయస్సుతో నిండి ఉండాలని, ఈ దసరా పండుగ మీ జీవితంలో భక్తి, అంకితభావం సంకల్పాన్ని తీసుకురావాలని మనసారా బీసీ సంక్షేమం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బైరి రవికృష్ణ గౌడ్ ఆకాంక్షించారు.

# మద్యపానంతో కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్త

- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం



**రామడుగు, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మద్యపానంతో కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశంఅన్నారు.. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ను పురస్కరించుకొని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలోనగరంలోని అశోక్ నగర్ లో ప్రకృతి ఐ ఆర్ సి ఏ డి– అడిక్షన్ , రిహాబిలిటేషన్ సెంటర్లోమానసిక ఆరోగ్యం పై ఆల్కహాల్ ప్రభావం'అనే అంశంపై ఇంటరాక్టీవ్స మావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైనఆయనమాట్లాడుతూమద్యపానం సేవించడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని, క్షణకాల ఆవేశంతో మద్యపానం సేవిస్తూకుటుంబంలో కలహాలకుకారణంఅవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు..ప్రతి చిన్న సమస్యగాని, సంతోష సమయాలలో అధికంగా మద్యపానం సేవిస్తూ ఇంటితో పాటు సమాజంలో అశాంతి కారణంఅవుతున్నారనిఅన్నారు.మద్యపానం మానివేసి కుటుంబము సమాజ క్షేమం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు.. ప్రతి సమస్యను ఎదుర్కోవడానికి మనసుని ఆయుధంగా మలుచుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ రిసోర్స్ పర్సన్ గాలిపల్లి నాగేశ్వర్ మాట్లాడుతూ మద్యపానం నుంచి విముక్తి పొందడానికి రిహాబిలిటేషన్ సెంటర్ ద్వారా తమ సేవలు అందిస్తున్నామని అన్నారు.. మంచి ఆరోగ్యం కోసంమద్యపానం నుండి విముక్తి పొందడం కోసం ప్రత్యేక శిక్షణ చికిత్స , అవగాహనను కలిగిస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా ఆ సెంటర్లో ఉన్న వ్యక్తులకు సమస్యలను అడిగి తెలుసుకొని బ్రతుకు పై భరోసా కల్పించారు. కార్యక్రమంలో కల్పన మౌనిక శోభ శ్రీనివాస్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



# మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు

- ఘనంగా మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం





**పరకాల, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ,మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకులు అఖిల్ శాస్త్రి చేత ప్రత్యేక పూజల అనంతరం,ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, కుంకుమేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గందే వెంకటేశ్వర్లు భక్తులకు అన్న ప్రసాద వితరణ(అన్నదానం) చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగెల్లి రంజిత్,ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి,కంచం రవితేజ,సత్యం, పింటు,దాసరి సాయి, మార్త రాజేంద్ర ప్రసాద్,రాకేష్, మధు,వరప్రసాద్,శివప్రసాద్,మనోహర్,పప్పులు,మనోహర్,చిన్న , రామ్ చరణ్,సిద్దు,తదితరులు పాల్గోన్నారు.

## నూతన వస్త్రాల బహుకరణతో దసరా పండుగ శుభాకాంక్షలు

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఆక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం,జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ సిబ్బందికి మేయర్ శాంతి కోటేష్ గౌడ్ తన సొంత ఖర్చులతో దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు బహుమతి గా ఇవ్వడం జరిగింది,కార్మికులు చేసే సేవ వెలకట్టలేనిది వారు మంచి ఆరోగ్యం తో ఉండాలని కోరుచున్నాను అన్నారు.

## మున్సిపాలిటీ సిబ్బందికి దసరా బహుమతిలు

- కౌన్సిలర్స్ నాను నాయక్, నాగయ్య పల్లి సుజాత శ్రీనివాస్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఆక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం దమ్మాయి గూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప కాలనీలో దసరా పండగ పురస్కరించుకొని మున్సిపల్ సిబ్బందికి బట్టలు, సబ్బులు, నూనెలు బహుమతి గా ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఒకటో వార్డ్ కౌన్సిలర్ భూక్య నాను నాయక్ మరియు రెండో వార్డ్ కౌన్సిలర్ సుజాత శ్రీనివాస్ రాజేష్ శ్రీనివాస్ల తో పాటు బి అర్ ఎస్ నాయకులు చారి, రాజేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించిన అధికారులు

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ హెడ్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో కరీంనగర్ లోని మైత్రి హోటల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, నాణ్యతలేని ఆహారం, లేబుల్ లేని పదార్థాలను, నిలువ ఉంచిన మాంసం, తుప్పుపట్టిన వంటపాత్రలను గుర్తించారు, అలాగే మరో స్వీట్ హౌస్ పై దాడులు నిర్వహించి నోటీసులు అందజేశారు.



## టీఎస్ ఆర్టీసీ బస్సును ప్రమాదం కాకుండా కాపాడిన తౌసిఫ్...





**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని గీత భవన్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల డిపో TS 23 T 4596 నెంబర్ గల ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుండి సిరిసిల్ల వైపు వెళ్ళుతుండగా బస్సు డ్రైవర్ కు హటాత్తుగా ఫీట్స్ రావడంతో, బస్సు క్రమం తప్పడం మొదలైంది దీనిని గమనించిన మహమ్మద్ తౌసిఫ్ అనే యువకుడు, భారత్ బిర్యాని పాయింట్ యజమాని అతను సాహసం చేసి రన్నింగ్ బస్సులోకి వెళ్లి బస్సులోని బ్రేక్ వేయడంతో బస్సు అక్కడే ఆగిపోవడంతో ఆ బస్సు డ్రైవరును కిందికి తరలించారు, తర్వాత తౌసిఫ్ ఆ బస్సును డ్రైవింగ్ చేసి ప్రక్కన పార్కింగ్ చేయడంతో బస్సు లో ఉన్నప్రయాణికులందరికీప్రమాదం కాకుండా తప్పించాడు.

## నామాపూర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**రామడుగు/పెగడ పల్లి అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామ ప్రజలు ఘనంగాజరుపుకున్నారు.గ్రామంలోని సంకిటి ఇనుగండ్ల కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలు బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు.. ఈ సందర్భంగా మహిళలు యువతులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. డిజె పాటలతో అమ్మాయిలు స్టెప్పులు వేసి ఉర్రూతలూగించారు.. ఈ కార్యక్రమంలోకాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్

**మహబూబాబాద్, అక్టోబర్ 11(పిసిడబ్లూ న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా ప్రజలకు.డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి మరియు దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి అని ఆయన పేర్కొన్నారు .దసరా పండుగ జిల్లా ప్రజలందరికీ మేలు చేయాలని, జిల్లాతో పాటు డోర్నకల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



## ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన రైతు బిడ్డ, విద్యార్థిని...



**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** బహుదూర్ ఖాన్ పేట కు చెందిన ఒక రైతు కుటుంబం అయినటువంటి గుర్రం లక్ష్మి, రవీందర్ రెడ్డి కు ఏకైక సంతానం అయినటువంటి గుర్రం సబిత గెజిటెడ్ ఉద్యోగంకు ఎంపిక అయినారు. వీరి కుటుంబం వ్యవసాయ ఆధారిత కుటుంబం. తల్లి తండ్రులు ఇద్దరు నిరక్షరాస్యులు, తమ కూతురు వారి లాగా కాకూడదని వారు నిరంతరం శ్రమించి ఉన్నత చదువులు చదివించారు. దానికి ఫలితంగా కూతురు గెజిటెడ్ ఉద్యోగం పొంది తల్లితండ్రులను గర్వపడేలా చేసింది. కరీంనగర్ కు (15) కిలో మీటర్ లో తమ ఊరు ఉన్నపడికి బాల్యంలో రోడ్లు మరియు బస్సు సౌకర్యం సరిగ్గా లేకపోవడం వల్ల ఐదవ తరగతి నుండే కరీంనగర్ లో సిద్ధార్థ హై స్కూల్ లో హాస్టల్ లో ఉండి పదవ తరగతి (2013)లో చేశారు. తర్వాత ఇంటర్మీడియట్, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి గేట్ ఎగ్జామ్ లో మంచి ర్యాంక్ తెచ్చుకొని ఒస్మానియా యూనివర్సిటీ లో ఎంటెక్ చేశారు. గత ఏడాది లో విడుదల అయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( గెజిటెడ్ కొలువు ) ఎగ్జామ్ లో బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఎనమిదివ ర్యాంక్ సాధించి రహదారులు మరియు భవనాల (ఆర్ అండ్ బి)శాఖలో జగిత్యాల డివిజన్ ఆఫీసులో ఈ నెల ఏడున విధుల్లో చేరినారు. గత ఏడాది లో విడుదల అయిన ఏఈ ఎగ్జామ్ లో రాష్ట్ర స్థాయిలో (330) ర్యాంక్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఎగ్జామ్ లో రాష్ట్ర స్థాయిలో (260) ర్యాంక్, టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఆఫీసర్‌లో (184) ర్యాంక్ సాధించారు. ఇలా నాలుగు ఉద్యోగాలు సాధించారు.వీటికి సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ప్రస్తుతం ఏఈఈ ఆర్ అండ్ బి శాఖ జగిత్యాల డివిజన్ ఆఫీస్ లో విధుల్లో చేరినారు. తమ ఊరికి సరిగ్గా రోడ్లు, ట్రాన్స్పోర్టేషన్ లేకపోవడం వల్ల తాను బాల్యం నుండే హాస్టల్ లో ఉండి చదువుకోవలసి వచ్చింది.అటువంటి పరిస్థితి మరియు కష్టం ఎవరికి రాకుండా, ఎవరైనా ఉన్నత విద్య వరకు వారి ఊరి నుండి వెళ్లి చదువుకునే విధంగా రహదారులు నిర్మించే విధంగా తన విధులను నిర్వహించడానికి సబిత ఆసక్తి చూపుతున్నారు. తల్లి తండ్రులు వారి కష్టానికి ఫలితం లభించి వారి పేరు నిలబెట్టినందుకు తమకు ఎంతో సంతోషంగా మరియు గర్వకారణంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**రామడుగు, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని గోపాలరావుపేటగ్రామంలోని బేడ బుడగ జంగం (ఎస్సి) కులానికి చెందిన కళ్లెం చిరంజీవి కొద్ది రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో మృతిచెందగా కుటుంబ దీన పరిస్థితి చూసి గ్రామంలోని ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నోముల శ్రీనివాస్ రెడ్డి ప్రతినెల 3000 కుటుంబానికి అందజేస్తారని హామీ ఇచ్చారు. అంతేకాకుండా మాజీ ఉపసర్పంచ్ ఎడవల్లి మధుసూదన్ రెడ్డి సొంతంగా 2000 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబం ఉండడానికి కూడా ఇల్లులేని దినస్థితిలో ఉన్నారని దాతలు ముందుకు వచ్చి చూసినంత సహాయం చేయాలని ఈసందర్భంగాకోరారు.కార్యక్రమంలోమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి తాజా మాజీ ఉపసర్పంచ్ ఎడవెల్లి మధుసూదన్ రెడ్డి ముదిగంటి సంతోష్ రెడ్డి మిత్ర బృందం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. దాతలు ముందుకు వచ్చి తోచినంత సహాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## బ్రంజ్ మెడల్ (కాంస్య) పతకం పొందిన కరీంనగర్ జిల్లా బాయ్స్ టీం

**కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ (THA) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని తొర్రూరులో, రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ/ పురుషుల తేది:9 నుండి 11 వరకు జరిగిన టోర్నమెంట్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాయ్స్ టీం బ్రంజ్ మెడల్ (కాంస్య) పతకం పొందడం జరిగింది. ఈ టీంలో రామడుగు గ్రామం నుండి 9 మంది క్రీడాకారులు ఆడడం జరిగింది. అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్బాల్ అసోసియేషన్ అధ్యక్షా/కార్యదర్శిలు వీర్ల వెంకటేశ్వర్ రావు,బసరవేణి లక్ష్మణ్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ మూల వెంకటేష్ మేనేజర్ నామిలకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.








## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్...



**సిద్ధిపేట, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మీలోని మంచితనం చెడుపైవిజయం సాధించాలని కోరుకుంటూ సిద్దిపేట పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల కుటుంబసభ్యులకు సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ మాట్లాడుతూ మీ జీవితం ప్రేమ ఆనందం విజయంతోనిండి ఉండాలని రావణుడి దిష్టిబొమ్మతో పాటు ఆ మంటల్లో మీ బాధలు, కష్టాలు కూడా దహనం అయిపోవాలని కోరారు. చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరికి విజయం సాధిస్తుందని అన్నారు. జీవితంలో అడ్డంకులను అధిగమించే శక్తి ధర్మ మార్గాన్ని అనుసరించే ధైర్యం మీకు లభించాలని అసత్యం పై సత్యం సాధించిన విజయాన్ని వేడుక చేసుకునే సమయమే ఈ దసరా పండుగ విశిష్టత అని అన్నారు. జీవితంలో సరైన మార్గాన్ని అనుసరించడానికిమీకు బలం, సంకల్పం లభించాలని అన్నారు. మీరు చేసే ప్రతి పనిలోనూ బలాన్ని శక్తిని ప్రసాదించాలని మీ ఇంటిల్లిపాదికి దుర్గమ్మ తల్లిఆరోగ్యాన్ని, శ్రేయస్సును అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు అన్నారు.

## ముగిసిన బోడ పెంట్టమ్మా అంత్యక్రియలు

- హాజరైన బిఎస్‌పి జిల్లా కమిటీ




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,అక్టోబర్ 11,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం చేర్యాల గ్రామం లో గురువారం సాయంత్రం బి ఎస్ పి మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షులు బోడ జంగయ్య తల్లి బోడ పెంట్టమ్మ 70 సం స్వర్గస్తులయ్యారు, ఈ రోజు శుక్రవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు,బంధువులు గ్రామ ప్రజలు డప్పు చెప్పుల మధ్య స్వగ్రామం చేర్యాల వైకుంఠ దమంలో బోడ పెంటమ్మ అంత్యక్రియలు జరిగాయి, ఈ అంతిమ యాత్రలో ఎం ఆర్ పి ఎస్ నాయకులు డాక్టర్ గోల్లూరి రాజు, పేపర్ రాజు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బానోతు రవీందర్, జిల్లా ఇంచార్జి గౌడ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సుక్క దయానంద్, ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి మల్లేష్, జిల్లా కోశాధికారి కొప్పు రాజయ్య,మేడ్చల్ అసెంబ్లీ కాంటెస్ట్ అభ్యర్థి మల్లెపూగు విజయ రాజ్, మేడిపల్లి మండలం అధ్యక్షులు విజయ్, బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షులు ప్రశాంత్,జవహర్ నగర్ కార్పొరేషన్ అధ్యక్షులు యకస్వామి, బామ్ సేఫ్ సుల్తాన్ రఘు, కాసు కుర్తీ శ్రీహరి, డి, కుమార్, మోర్కే భీమ్, ఇటికల అంబేద్కర్, కీసర మండలం అధ్యక్షులు జగన్నాద్ లు బోడ పెంట్టమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## దుర్గ భవాని కుంకుమ పూజ

- అన్న ప్రసాద కార్యక్రమం: తోట కవిత కృష్ణ



**రామడుగు, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దుర్గ భవాని ఎనిమిదో రోజు కుంకుమ పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దుర్గ భవాని ఎనిమిదవ రోజు పురస్కరించుకొని కురుమ సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేపట్టగా రామడుగు మండల దిశ పాత్రికేయులు తోట కవిత కృష్ణ 500 మందికి పైగా అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా కడారి బీరయ్య యువకులకు టీ షర్టులు ప్రధానం చేశారు. దుర్గ మాత యువజన సంఘానికిఈ సందర్భంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం యువజన అధ్యక్షులు కడారి రాజు. పూజారి సుదర్శనం కురుమ సంఘం అధ్యక్షులు కుల కిష్టయ్య మాజీ ఉపసర్పంచ్ కడారి బీరయ్య శంకర్ ప్రభాకర్ అనిల్ గణేష్ రాకేష్ శ్రీను కుమార్ మహిళలు పురుషులు తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మాపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి శంకుస్థాపన...







**మానకొండూర్, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ పరిధిలోనీ యాదవులపల్లి శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయంలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంత్రి పొన్నం ప్రభాకర్,రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ..అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు...ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ఒక ఆలోచనతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తీసుకొచ్చారు .కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా, వైద్యం ,వ్యవసాయం మరింత ముందుకు పోవాలనీ ఆలోచనతో ముందుకు పోతున్నాం.మొదటి దశలో (28) ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లకి శంఖుస్థాపన చేస్తున్నారు.నేను హుస్నాబాద్ లో కోహెడ మండలంలో భూమి పూజ చేశాం.ఉప ముఖ్యమంత్రిని పిలుచుకొని గొప్ప కార్యక్రమం చేస్తున్నాం.మంత్రులంతా వారి నియోజకవర్గాల్లో చేస్తున్నారు.జీవో (198) ద్వారా మొదటి దశలో (28) మంజూరు చేశారు.గత ప్రభుత్వం కులం ,మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేశారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందరూ కలిసి ఒక్క దగ్గర చదువుకుంటారు.రాష్ట్ర ,దేశ నిర్మాణానికి ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతుంది.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన (48) గంటల్లో ఉచిత బస్సు,ఆరోగ్య శ్రీ పది లక్షలు ,రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ ఎవరికైనా రాకపోతే మండల అధికారులతో పిర్యాదు చేయాలి..(500) కి గ్యాస్ అందిస్తున్నాంఅమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా (25) వేల పాఠశాలలో (1100) కోట్ల తో మౌలిక వసతులు కల్పించాం.అధ్యాపక వర్గానికి అసహనం తొలగించాం.. పది సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నా వారికి (19) వేల ప్రమోషన్లు ,(35) వేల బదిలీలు చేపట్టినం పాఠశాల లకు ఉచిత విద్యుత్,డ్రింకింగ్ వాటర్,శానిటేషన్ సిబ్బందికి నిధులు మంజూరు.విద్యార్థుల సంఖ్య ను బట్టి టీచర్ల డిప్యూటీషన్ చేయడం కలెక్టర్ లకు అప్పగించినం.అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ తీసుకొస్తున్నం.డీఎస్సీ ద్వారా పది వేల మందికి ఉద్యోగాలు (56) రోజుల్లోనే ఇచ్చినం.మీరు ఉద్యోగ నియామకాలు చేస్తుంటే ఎవరైనా అడ్డుకున్నారా మీ కూతురు. మాజీ పార్లమెంటు సభ్యుడు ఓడినప్పుడు నిబంధనలు అడ్డురాలేదా .. నీళ్లు నిధులు నియామకాలు కోసం కొట్లడిన వారికి ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదు.వాళ్ళు పది సంవత్సరాల కాలంలో చేసినవి పది నెలల్లో చేసినవిరెండు లక్షల పైన ఉన్న వారికి వాళ్ళు అప్పు మేము తిరుస్తాం.. పైన డబ్బులు కట్టండి..మిగిలినవి రెండు లక్షల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది..శాసన సభ లో తెలంగాణ ఆర్థిక విధానం మీద శ్వేత పత్రం రిలీజ్ చేసి తెలంగాణా ప్రజలకు చెప్పినం.ఏడు లక్షల యాభై వేల కోట్ల అప్పు చేసింది... దాంతో పాటు (40) వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది.లక్షా (50) వేల కోట్ల వివిధ పనులకు అనుమతులు ఇచ్చారు.ఇండియన్ బ్యాంక్ ,ఓవర్సీస్ బ్యాంక్ సమస్యలు ఉన్నాయి.ఎవరికైనా అర్హత ఉండి రైతు రుణమాఫీ కాకపోతే మీ వు అరకు అధికారులకు ఇవ్వండి .ఎన్నికైన నెల రోజుల లోపే ప్రభుత్వం కులుతుందని పిల్లి శాపనార్థాలు పెట్టారు.విద్యా ,వైద్యం ,ఉపాధి అవకాశాలు, ఏం.ఎస్.ఎమ్మి పాలసీ తీసుకొచ్చినం.రుణమాఫీ పూర్తయిన బి.ఆర్.ఎస్ వాళ్ల లెక్కలు తీయండి.అబ్దుల్ కలామ్ నుండి మొదలు అందరం ప్రభుత్వ పాఠశాలలో చదివి వచ్చాం.నేను పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పుడు కేంద్రీయ విద్యాలయం తెచ్చినం. కస్తూర్బా పాఠశాల,రైలు ,మోడల్ స్కూల్, పాస్ పోర్ట్ ఆఫీస్ తెచ్చినం మానకొండూరు లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తెచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకి అభినందనలుకవ్వంపల్లి సత్యనారాయణ , మానకొండూరు ఎమ్మెల్యేరాష్ట్ర వ్యాప్తంగా (28) స్కూల్స్ శంఖు స్థాపన చేసుకుంటాడగా అందులో మానకొండూరు నియోజకవర్గంలో ఒకటి..మానకొండూరు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ రావడానికి మన మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర పోషించారు .అన్ని సామాజిక వర్గాలు ఎస్సి ఎస్టీ బీసీ మైనార్టీ లు ఒకే రుఫ్ కింద చదువుకోలవాల్ని చెప్పారు.ఎస్సి స్కూల్ ఎస్సీలకు ,బీసీ లు బిసిలకే,మైనార్టీ లో చదువుకుంటే మైనార్టీల కే పరిమితం అయింది.వచ్చే జూన్ లో అకాడమిక్ ఇయర్ ప్రారంభించేలా ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వేగంగా అడుగులు పడనుంది.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి...



**మంథని, అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రపంచ మేటీ విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం మంత్రి డి.శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని మండలంలో అడవి సోమనపల్లి గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ,మార్పు తిసుకువస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామని అన్నారు. గ్యారెంటీ పథకాలలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల సబ్సిడీ సిలిండర్, మరియు ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభిస్తామని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్యాబినెట్ సహచరులు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు.యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల క్రింద ప్రభుత్వం మొదటి విడతలో 28 పాఠశాలలను మంజూరు చేసిందని, మానేరు నది ఒడ్డున ఉన్న అడవి సోమనపల్లి గ్రామంలో యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించిన డిఎస్సీ నియామకం అంశాన్ని రికార్డు సమయంలో ప్రజా ప్రభుత్వం పూర్తి చేసి, ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా 11 వేలకు పైగా నూతన టీచర్లను నియమించడం జరిగిందని, ఇదే గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ అనే యువకుడికి ఎస్.జి.టి ఉద్యోగం లభించిందని అన్నారు. గడిచిన 10 ఏళ్ళలో పెండింగ్ ఉన్న టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని, విద్యాశాఖ మెరుగుపరిచేందుకు కమిషన్ ఏర్పాటు చేశామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో , అన్ని వసతులతో కుల, మత భేదాలు లేకుండా మన విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థను మంజూరు చేస్తుందని, 25 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సి, ఎస్టీ ,బీసి, మైనారిటీ వంటి అన్ని రంగాల విద్యార్దులు ఒకే ప్రాంగణంలో చదివేలా ఈ విద్యా సంస్థ ఉంటుందని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన అందుతుందని, విద్యార్థుల సౌకర్యం కొరకు తరగతి గదులలో డిజిటల్ స్మార్ట్ బోర్డ్, కంప్యూటర్ ల్యాబ్ , 5 వేలకు పైగా పుస్తకాలతో కూడుకున్న గ్రంథాలయం మొదలగు అత్యాధునిక సౌకర్యాలతో 25 ఎకరాల విస్తీర్ణంలో విద్యాసంస్థ నిర్మాణం ఉంటుందని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల్లో క్రికెట్ , ఫుట్ బాల్ ,బాస్కెట్ బాల్, టెన్నిస్ మొదలగు క్రీడలు ఆడేందుకు అవసరమైన గ్రౌండ్, ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. వచ్చే సంవత్సరం దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని, అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట అంతర్జాతీయ స్థాయి విద్య అందుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలలో ,2500 పైగా విద్యార్థుల చదువుకుంటారని, వీరికి 120 మంది టీచర్లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా సొంతంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. 250 నుంచి 300 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. త్వరలో రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కూడా ఇటువంటి ఇంటిగ్రేటెడ్ స్కూల్ లోను మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.అనంతరం మంత్రి గౌడ కులస్తులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి రక్షక కవచ కిట్ పై దాదాపు 9 వేల రూపాయలు ఖర్చు చేసి సబ్సిడీపై పూర్తి ఉచితంగా గౌడ సోదరులకు అందిస్తుందని, చెట్టు పై కల్లు తీసేందుకు వెళ్లినప్పుడు ఈ కిట్ ఉపయోగించడం వల్ల ప్రమాదాలను నియంత్రించవచ్చని, ప్రతి గౌడ సోదరుడు ఈ కిట్ ను వినియోగించాలని అన్నారు. చెట్టు పైకి ఎక్కి కళ్ళు తీసే గౌడ సోదరులను గుర్తించి కాటమయ్య రక్షక కిట్లను ముందుగా పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించి ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలను నిర్మిస్తుందని అన్నారు. మన రాష్ట్ర భవిష్యత్తు పిల్లలని, అటువంటి పిల్లల కోసం సమీకృత విద్యాలయాలు నిర్మించడం సంతోషకరమని అన్నారు. బీ ఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికి విద్యా హక్కు కల్పించారని అన్నారు. హైదరాబాద్ లో కాక వెంకట స్వామి విద్యా సంస్థను ఏర్పాటు చేసి సంవత్సరానికి 5 వేల మందిని తక్కువ ధర విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పిల్లలకు అవసరమైన వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్యా సంస్థ ఆశించిన స్థాయిలో లేవని గమనించి ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని, ముందస్తుగా 28 నియోజకవర్గాలలో నేడు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు. మన జిల్లాలో మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని అడవి సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ మంజూరు కావడం జరిగిందని అన్నారు. 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థ నిర్మిస్తున్నామని, భవిష్యత్తు అవసరాల కోసం మరో 5 ఎకరాలు విస్తరించే అవకాశం సైతం ఇక్కడ ఉందని, గ్రామ ప్రజలకు ఇబ్బంది కాకుండా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ కోసం 900 మీటర్ల ప్రత్యేక 4 లైన్ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు.నాణ్యతతో కూడిన భవన నిర్మాణ వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమ,ఆర్.%ఙ% బి ఈ.ఈ.భావ్ సింగ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, ఎక్సైజ్ సూపరంటెండెంట్ మహిపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు..



**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది.ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశించారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతోపాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

## ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 272 నర్సింగ్ ఆఫీసర్లు, 99 ఫార్మాసిస్ట్ పోస్టులకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత నెలలో 2050 నర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. ఆ 2050 పోస్టులకు అదనంగా 272 పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 2322 నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మాసిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తులకు ఈ నెల 14 తుది గడువు. నవంబర్ 17న ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహించనున్నారు.

## మెదక్ జిల్లాలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**హైదరాబాద్,అక్టోబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేవాలయాలలో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని నాగిరెడ్డి పేట్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట్, చేగుంటలోని ఆలయాల్లో గత నెలలో నాలుగు దొంగతనాలు జరిగాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు వేగవంతం చేశామని, చిన్న శంకరంపేట (మం) గవ్వలపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొందరు అనుమానస్పదంగా టాటామంజా కారులో తప్పించుకొనే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు.వారిని చాకచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పట్టుబడిన ముఠాలో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అస్లాం, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌గా గుర్తించమని ఆ ముగ్గురు పాత నేరస్థులే అని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట ముఠా నుంచి మూడు సెల్ ఫోన్‌లు, ఒక కారు, ఐదు లక్షల 50 వేల రూపాయల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నమని ఎస్పీ వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందనందించారు.



# ప్రయోగాలకు సిద్ధమైన సూర్యకుమార్

**- మూడో టీ20లో కీలక మార్పులు చేసే అవకాశం**



భారత్, బంగ్లాదేశ్ మధ్య టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో చివరి మ్యాచ్ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ప్లేయింగ్-11లో కొన్ని మార్పులు చేయవచ్చు. భారత్ వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ని కైవసం చేసుకుంది. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను క్లీన్‌స్వీప్ చేయడంపైనే ఆ జట్టు దృష్టి ఉంది. భారత్ సిరీస్‌ని చేజిక్కించుకుంది. కాబట్టి సూర్యకుమార్ కొన్ని ప్రయోగాలు చేసేందుకు సిద్ధమయ్యాడు. మూడో టీ20 మ్యాచ్‌లో వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్‌ను తొలగించవచ్చు. సంజూ శాంసన్ ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్ చేశాడు. కానీ, భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విజయం సాధించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో 29 పరుగులు చేసి అవుటయ్యాడు. అదే సమయంలో రెండో టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో శాంసన్ 10 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ శాంసన్ ఓపెనర్‌గా వచ్చాడు. ఇటువంటి పరిస్థితిలో, అతన్ని చివరి మ్యాచ్‌లో ప్లేయింగ్-11 నుంచి తొలగించవచ్చు. అతని స్థానంలో జితేష్ శర్మకు అవకాశం లభించవచ్చు అని తెలుస్తోంది. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేయవచ్చు. అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో అతనికి ప్లేయింగ్-11లో అవకాశం ఇవ్వవచ్చు. చివరి మ్యాచ్‌లో అర్ష్‌దీప్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చు. మయాంక్ యాదవ్ ఇప్పటివరకు కేవలం 2 టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అతనికి విశ్రాంతి ఇవ్వకపోవచ్చు. ఇది కాకుండా, వరుణ్ చక్రవర్తికి విశ్రాంతి ఇవ్వబడుతుందని భావించలేదు. ఎందుకంటే, అతను మూడేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చిన తర్వాత అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. ప్లేయింగ్ ఎలెవన్‌లో మార్పు ఉండవచ్చు. వాషింగ్టన్ సుందర్‌కు విశ్రాంతి లభించవచ్చు. అతని స్థానంలో ఇప్పటి వరకు బెంచ్‌లో ఉన్న తిలక్ వర్మను తీసుకోవచ్చు. నితీష్ రెడ్డి, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్ జట్టులో కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.**భారత్ ప్రాబబుల్ ప్లేయింగ్-11..**అభిషేక్ శర్మ, నితీష్ రెడ్డి, సూర్యకుమార్ యాదవ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, ర్యాన్ పరాగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

# తొలి టి20లో నితీశ్‌కు తుది జట్టులో చోటు



ఆడింది ఒకే ఒక్క ఐపీల్ సీజన్.. కానీ అదరగొట్టాడు.. ఆడుతున్నది రెండో అంతర్జాతీయ మ్యాచే.. కానీ దుమ్మురేపాడు.. టి20ల్లో బంతిని ఎలా కొట్టాలో చూపుతూ.. ఇన్నింగ్స్ గేర్ ఎలా మార్చాలో చెబుతూ.. చెలరేగిపోయాడు. ఇదంతా తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి గురించి. కేవలం 21 ఏళ్లున్న ఈ కుర్రాడు బంగ్లాదేశ్ తో జరిగిన రెండో టి20లో ఎలాంటి బాదుడు బాదాడో అందరూ చూశారు. ఏడు సిక్సర్లతో విధ్వంసాన్ని రుచి చూపించాడు. ఏమాత్రం బెరుకు లేకుండా కళ్లు చెదిరే షాట్లతో బౌలర్లను బెంబేలెత్తించాడు. అటు అభిమానులను ఉర్రూతలూగించాడు. కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా.. బాదుడు మొదలెట్టాక తగ్గలేదు. అన్నీ చక్కటి క్రికెటింగ్ షాట్లే. అన్నీరకరకాల షాట్లే. నితీశ్ కుమార్ రెడ్డి 2024 ఐపీఎల్ సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున మంచి ప్రదర్శన చేశాడు. దీంతో ఆ వెంటనే జింబాబ్వే టూర్ కు ఎంపిక చేశారు. కానీ, గాయం కారణంగా ఆడలేకపోయాడు. అలా అప్పుడు మిస్ అయిన లక్.. ఇప్పుడు తన్నుకుంటూ వచ్చింది. బంగ్లాదేశ్ తో మూడు టి20ల సిరీస్ కు ప్రకటించిన జట్టులో నితీశ్ ఉన్నాడు. కానీ.. కూర్పు కారణంగా తుది జట్టులో ఆడించడం కష్టమే అయింది. ఇంతలో అనుకోని విధంగా ఆల్ రౌండర్ శివమ్ దూబె గాయపడ్డాడు. అతడి స్థానంలో మరో తెలుగు క్రికెటర్ తిలక్ వర్మకు చోటు దక్కినా.. అతడు జట్టుతో చేరేసరికి టైం పట్టింది. ఈ నేపథ్యంలోనే తొలి టి20లో నితీశ్ కు తుది జట్టులో చోటు దొరికింది. ఆ మ్యాచ్ లో మెరుగ్గా ఆడడంతో రెండో మ్యాచ్ లోనూ అవకాశం ఇచ్చారు.రెండో టి20లో నితీశ్ స్థానంలో తిలక్ వర్మను ఆడిస్తారని అందరూ భావించారు. జట్టు మేనేజ్ మెంట్ విన్నింగ్ ఎలెవెన్ ను మార్చకూడదని భావించిందో ఏమో..? నితీశ్ కు మరో అవకాశం ఇచ్చింది. దీనిని అతడు రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. నమ్మకాన్ని నిలబెట్టాడు. కాగా, రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ వంటి ఆటగాళ్లు ఉన్నప్పటికీ నితీశ్ ను అత్యంత కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపింది టీమ్ మేనేజ్ మెంట్. అతడు దీనికి సంపూర్ణ న్యాయం చేశాడు. జట్టులో గొప్ప బ్యాటర్ ఆడే స్థానంలో బ్యాటింగ్ దిగినా ఒత్తిడికి గురికాలేదు. ఇక నితీశ్ బ్యాటింగ్ పై ఎంత చెప్పినా తక్కువే. బంగ్లా సీనియర్ ఆటగాడు మహ్మదుల్లా బౌలింగ్ లో లాంగాన్‌లో సిక్స్ కు లాఫ్ట్, స్పిన్నర్ రిషాద్ బౌలింగ్ లో లాంగాఫ్ లోకి మరో లాఫ్ట్, తర్వాత స్లాగ్ స్వీప్ తో లాంగాన్ లోకే సిక్స్.. పేసర్ ముస్తాఫిజుర్ ఆఫ్ కటర్ ఫ్లాట్ సిక్స్ ఇలా చెలరేగిపోయాడు. టీమ్ ఇండియాకు పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ల కొరత ఉంది. శివమ్ దూబె వంటి వారున్నా అతడి బౌలింగ్ లో పేస్ ఉండదు. 125 కిలోమీటర్లకు మించి వేగం కష్టమే. హార్దిక్ పాండ్యా మాత్రం 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేయగలడు. కానీ, హార్దిక్ కు గాయాల బెడద ఉంది. ఈ నేపథ్యంలో నితీశ్ కాబోయే సూపర్ స్టార్ లా కనిపిస్తున్నాడు. బౌలింగ్ లో బుధవారం నాటి మ్యాచ్ లో 2 వికెట్లు తీసిన అతడు ఆకట్టుకున్నాడు. ప్రత్యేకించి 135 కిలోమీటర్ల వేగంతో బంతులేశాడు. దీంతోనే నితీశ్ కు మంచి భవిష్యత్ ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# రోహిత్ శర్మ అద్భుతంగా ఆడగలడు

**- రోహిత్ శర్మకు టాలెంట్ దేవుడిచ్చిన బహుమతి**

**- టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని**



భారత క్రికెట్ చరిత్రలోనే అంతర్జాతీయ వన్డేల్లో ఏకంగా మూడు డబుల్ సెంచరీలు చేసి చరిత్ర సృష్టించాడు కెప్టెన్ రోహిత్ శర్మ. 2007లో వన్డేల్లో అరంగేట్రం చేసిన రోహిత్.. మొదటి మూడు మ్యాచ్‌ల్లో మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవాడు. ఆ తర్వాత అతడి నాలుగో వన్డే మ్యాచ్ నుంచి జట్టులో ఓపెనర్‌గా ఆడిన మొదటి మ్యాచ్‌లోనే 93 బంతుల్లో 83 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రోహిత్ దూకుడు ప్రదర్శనతో భారత జట్టు 48 ఓవర్లలోనే 258 పరుగులు చేసి 3-1 తేడాతో సిరీస్‌ని దక్కించుకుంది. అయితే తాజాగా ఈ మ్యాచ్‌లో రోహిత్ ఆటతీరుని గుర్తు చేసుకున్నాడు టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ. రోహిత్ శర్మకు టాలెంట్ దేవుడిచ్చిన బహుమతి అంటూ కొనియాడాడు. 'రోహిత్ శర్మ అద్భుతంగా ఆడగలడు. అతడి ఆటతీరుకి నేను చాలా సంతోషిస్తున్నాను. అతడికి టాలెంట్ దేవుడిచ్చిన బహుమానం. ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం రోహిత్‌కి చాలా అవసరం. జట్టులో గొప్ప స్థాయికి చేరుకోవడానికి ఇలాంటి ప్రదర్శన ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. వ్యక్తిగతంగా అతడు ఆడే విధానానికి నేను చాలా ఆనందంగా ఉన్నాను. అప్పుడు రోహిత్, మనోజ్ తివారిలు జట్టులో ఓపెనర్లుగా ఉన్నారు. ఇద్దరిలో ఒకరు కచ్చితంగా దూకుడుగా ఆడేవాళ్లు ఉండాలనుకున్నాం. మనోజ్ అలాంటి ప్రదర్శన చేయలేదు. కాబట్టి రోహిత్ దాన్ని సవాలుగా తీసుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఓపెనర్‌గా మంచి ప్రదర్శనలు ఇస్తున్నాడు' అంటూ ధోనీ రోహిత్‌ను ప్రశంసించాడు. కాగా రోహిత్ 265 వన్డే మ్యాచ్‌ల్లో 10,866 పరుగులు చేశాడు. ఇదిలా ఉండగా, హిట్‌మ్యాన్ తన 16ఏళ్ల కెరీర్‌లో ఎన్నో రికార్డులు నమోదు చేశాడు. వన్డే చరిత్రలో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు రోహిత్. 2014లో శ్రీలంకతో జరిగిన వన్డేలో అత్యధిక స్కోర్(264) చేసి రికార్డు సృష్టించాడు. 2019 వన్డే ప్రపంచ కప్‌లో ఒకే ఎడిషన్‌లో ఐదు సెంచరీలు సహా అత్యధిక సెంచరీలు(7) సాధించాడు. 241 ఇన్నింగ్స్‌లోనే 10వేల పరుగుల మార్క్‌ని అందుకున్న రెండో ఆటగాడిగా నిలిచాడు రోహిత్. కాగా నవంబర్‌లో ఆస్ట్రేలియాతో జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్ట్‌కు రోహిత్ అందుబాటులో ఉండకపోవచ్చనే వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే.

# తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం


**- ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో పాకిస్థాన్ ఓటమి**



పాకిస్థాన్ క్రికెట్ టీమ్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన పాకిస్థాన్.. తాజాగా ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో చిత్తయ్యింది. ముల్తాన్ వేదికగా శుక్రవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయంతో పాకిస్థాన్ అత్యంత చెత్త రికార్డ్‌ను తమ పేరిట లిఖించుకుంది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు నమోదు చేయని చెత్త రికార్డ్‌ను తమ ఖాతాలో వేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 550 ప్లస్ రన్స్ చేసినా ఇన్నింగ్స్ తేడాతో ఓడిపోవడం టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి. అంతేకాకుండా ఇరు జట్లు తమ తొలి ఇన్నింగ్స్‌ల్లో 550 ప్లస్ రన్స్ నమోదు చేసిన సందర్భంలో ఫలితం తేలిన రెండో మ్యాచ్ కూడా ఇదే.ఇంగ్లండ్‌తోనే 2022లో జరిగిన మ్యాచ్‌లోనూ పాకిస్థాన్ 74 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 152/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో చివరి రోజు ఆటను ప్రారంభించిన పాకిస్థాన్ మరో 68 పరుగులు మాత్రమే జోడించి రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులకు ఆలౌటైంది. అఘా సల్మాన్(63), ఆమీర్ జమాల్(55 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. ఆఖరి బ్యాటర్ అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు రాలేదు. దాంతో అంపైర్లు పాకిస్థాన్ ఆలౌటైనట్లుగా ప్రకటించారు. ఇంగ్లండ్ బౌలర్లలో స్పిన్నర్ జాక్ లీచ్ నాలుగు వికెట్లు తీయగా.. గస్ అట్కిన్సన్, కార్సె రెండేసి వికెట్లు పడగొట్టారు. క్రిస్ వోక్స్‌కు ఓ వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్ 823/7 రికార్డ్ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్(322 బంతుల్లో 29 ఫోర్లు, 3 సిక్స్‌లతో 317) సెంచరీతో చెలరేగగా.. జో రూట్(375 బంతుల్లో 17 ఫోర్లతో 262) రికార్డ్ డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. దాంతో ఆ జట్టుకు 267 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. ఇంగ్లండ్ సాధించిన ఆధిక్యాన్ని కూడా పాకిస్థాన్ అందుకోలేకపోయింది. త్రిశతకంతో సత్తా చాటిన హ్యారీ బ్రూక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.సొంతగడ్డపై పాకిస్థాన్‌కు ఇది వరుసగా ఆరో ఓటమి కావడం విశేషం. గత 9 టెస్ట్‌ల్లో పాక్ ఏడింట్లో ఓటమిపాలైంది. మార్చి 2022 నుంచి తాజా మ్యాచ్ వరకు పాకిస్థాన్ సొంతగడ్డపై ఒక్క టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. మొత్తం 11 టెస్ట్‌లు ఆడగా.. ఏడింటిలో ఓటమిపాలైంది. నాలుగు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

# బాబర్, షాహిన్ అఫ్రిదీ మధ్య తారా స్థాయికి చేరిన విభేదాలు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్, స్టార్ పేసర్ షాహిన్ అఫ్రిదీ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి కారణంగా పాకిస్థాన్ క్రికెట్ టీమ్ డ్రెస్సింగ్ రూమ్ రెండు వర్గాలుగా చీలినట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆటగాళ్ల గొడవల కారణంగానే పాకిస్థాన్ జట్టు దారుణ పరాజయాలను మూటగట్టుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విమర్శలను పాకిస్థాన్ మేనేజ్‌మెంట్ ఎప్పటికప్పుడూ తిప్పికొడుతున్నా.. ఆటగాళ్లు మాత్రం మైదానంలోనే గొడవకు దిగుతున్నారు. తాజాగా ఇంగ్లండ్‌తో ముగిసిన తొలి టెస్ట్‌లోనూ షాహిన్ అఫ్రిదీ, బాబర్ ఆజామ్ గొడవపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా షాహిన్ అఫ్రిదీ.. బాబర్ ఆజామ్ బ్యాటింగ్ వైఫల్యాన్ని ప్రస్తావిస్తూ ఎగతాళి చేసినట్లు ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోలో షాహిన్ అఫ్రిది.. బాబర్ ఆజామ్‌ను ఉద్దేశించి జింబూ, జింబూ అని గట్టిగా అరుస్తున్నాడు. జింబూ అనేది బాబర్ ఆజామ్‌కు అతని హేటర్స్ పెట్టిన పేరు. బాబర్ ఆజామ్ పసికూన జట్లపైనే పరుగుల మోత మోగిస్తాడని, జింబాబ్వే వంటి చిన్నదేశాలపై మాత్రమే సెంచరీలు సాధిస్తాడని, బలమైన జట్లపై దారుణంగా విఫలమవుతాడనే అభిప్రాయం ఉంది. ఈ క్రమంలోనే కొందరు నెటిజన్లు బాబర్ ఆజామ్‌ను జింబూ అనే నిక్ నేమ్‌తో ఎగతాళి చేస్తారు. సోషల్ మీడియా వేదికగా బాబర్ ఆజామ్‌ను ట్రోల్ చేసేందుకు ఈ పదాన్ని వినియోగిస్తారు. అయితే ఈ పదాన్ని తాజాగా షాహిన్ అఫ్రిదీ వాడటం చర్చనీయాంశమైంది. ఇంకా పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో గొడవలు సెట్ అవ్వలేదని ఈ వీడియోతో అర్థమవుతోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. కెప్టెన్సీ విషయంలో బాబర్ ఆజామ్, షాహిన్ అఫ్రిదికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవలకు పీసీబీ అనాలోచిత నిర్ణయాలు కూడా ఆజ్యం పోసాయి. వన్డే ప్రపంచకప్ 2023 పరాజయం అనంతరం బాబర్ ఆజామ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో షాహిన్ అఫ్రిదిని సారథిగా ఎంపిక చేశారు. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడిన అతన్ని.. టీ20 ప్రపంచకప్ 2024 ప్రారంభానికి ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి మళ్లీ బాబర్ ఆజామ్‌కు అప్పగించారు. దాంతో ఈ ఇద్దరి మధ్య గొడవలు తారా స్థాయికి చేరాయి. దాంతో మెగా టోర్నీలో పాక్ లీగ్ దశలోనే వెనుదిరిగాల్సి వచ్చింది. గత రెండేళ్లుగా బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమవు తున్నాడు. 2022 డిసెంబర్‌లో అతను చివరిసారిగా శతకం సాధించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసినా ఘోర ఓటమిని మూటగట్టుకుంది.



# జిగ్రాలో నీ నటన అమోఘం


## - నువ్వు కేక..అలియాకు రష్మిక కితాబు



బాలీవుడ్ నటి అలియాభట్ పై నటి రష్మిక ప్రశంసల వర్షం కురిపించారు. యాక్టింగ్‌లో అలియా టాలెంట్, కథల ఎంపికను ఆమె మెచ్చుకున్నారు. విభిన్నమైన కథలను తరచూ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టారు. అలియా భట్, వేదాంగ్ నటించిన 'జిగ్రా' చూశా. సినిమా అద్భుతంగా ఉంది. నటీనటులు, చిత్రబృందాన్ని గట్టిగా హత్తుకుని మెచ్చుకోకుండా ఉండలేకపోయా. అలియా.. నువ్వు మాకు దొరకడం ఓ వరం. నీ టాలెంట్‌ని చూసే అవకాశం మాకు ఇచ్చినందుకు థాంక్యూ. వేదాంగ్ నువ్వు మరెన్నో చిత్రాలు నటిస్తే చూడాలనుకుంటున్నా. రాహుల్.. నువ్వు నన్నెంతో సర్‌ప్రైజ్ చేశావు. నీకు, 'జిగ్రా'లో నువ్వు పోషించిన మత్తు పాత్రకు చాలా వ్యత్యాసం ఉంది. వాసన్ బాలా.. మేకింగ్ చాలా బాగుంది. ఇంకెన్నో విషయాలు చెప్పాలని ఉంది. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు అని రష్మిక రాసుకొచ్చారు. బాలీవుడ్ నటీనటులు అలియాభట్ , వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా' యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత. తమ్ముడు కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో ఇది సిద్ధమైంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినీ తారల కోసం ముంబయిలో 'జిగ్రా' స్పెషల్ షో వేశారు. దీనికి రష్మిక హాజరైన విషయం తెలిసిందే. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. సినిమా విడుదల సందర్భంగా మహేశ్‌బాబు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# రొటీన్ కథల నుంచి బయటపడని శ్రీనువైట్ల

## - విశ్వం మూవీలో కనిపించని కొత్తదనం




నటుడు గోపీచంద్.. దర్శకుడు శ్రీను వైట్ల ఇద్దరూ కొన్నాళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న క్రమంలో... ఇప్పుడీ ఇద్దరూ కలిసి విజయమే లక్ష్యంగా 'విశ్వం'తో విజయదశమి బరిలో నిలిచారు. ఇది వీళ్ల కాంబోలో తొలి సినిమా. ఇప్పటికే దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అసలు కథేంటంటే.. జలాలుద్దీన్ ఖురేషి (జిషు సేన్) కరుడుగట్టిన ఐఎస్ఐ టెర్రరిస్ట్. సంజయ్ శర్మ అనే మారుపేరుతో భారత్‌లో నివసిస్తూ.. విద్యా వ్యవస్థ ముసుగులో విద్యార్థుల్ని తీవ్రవాదులుగా తయారు చేస్తుంటాడు. వాళ్ల సాయంతో పెద్ద ఎత్తున మారణహోమం సృష్టించి భారత్‌ను నాశనం చేయాలని ప్రణాళిక రచిస్తుంటాడు. దీనికోసం కేంద్రమంత్రి సీతారామరాజు (సుమన్) సోదరుడైన బాచిరాజు (సునీల్) సాయం తీసుకుంటాడు. కానీ, తన ఉగ్రచర్యల సంగతి సీతారామరాజుకు తెలియడంతో బాచిరాజుతో కలిసి అతన్ని జలాలుద్దీన్ కిరాతకంగా చంపేస్తాడు. ఈ హత్యను దర్శన అనే ఓ చిన్న పాప చూస్తుంది. దీంతో ఆ పాపను కూడా చంపాలని బాచిరాజుతో చెప్పి ఓ పని మీద కశ్మీర్‌కు వెళ్తాడు జలాలుద్దీన్. అయితే బాచిరాజు ముఠా ఆ పాపను చంపబోగా ఆ చిన్నారి కుటుంబానికి గోపిరెడ్డిగా పరిచయమైన విశ్వం (గోపీచంద్) కాపాడతాడు. శ్రీను వైట్ల చిత్రాల్లో కథలు ఓ థీమ్‌లో సాగుతుంటాయి. దేశానికి కొన్ని విద్రోహ శక్తుల నుంచి ముప్పు ఏర్పడటం.. ఆ కుట్రల్ని భగ్నం చేసేందుకు హీరో తన ఐడింటిటీని దాచి పెట్టి మారుపేరుతో ఓ ఇంటిలో చేరి రహస్యంగా మిషన్‌ను చేపట్టడం.. ఈ క్రమంలో తన తెలివితేటలతో ఆ విద్రోహ శక్తుల్ని తన ట్రాప్‌లో పడేలా చేసి వాళ్ల ఆట కట్టించడం కనిపిస్తుంటుంది. శ్రీను వైట్ల నుంచి వచ్చిన 'దూకుడు', 'బాద్‌షా' చిత్రాలు ఈ కోవకు చెందినవే. ఈ థీమ్ రొటీన్‌గా మారిపోవడంతో శ్రీనుకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. అందుకే ఈసారి తన పంథాను పూర్తిగా మార్చుకుని.. ఈతరం ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం నిండిన కథతో 'విశ్వం'ను సిద్ధం చేసినట్లు ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు. కానీ, తెరపై సినిమా చూస్తున్నప్పుడు ఆయన ఇంకా తన పాత పంథా నుంచి అసలు బయటకు రాలేదనే అనిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'దూకుడు'కు గోపీచంద్ వెర్షన్‌లా ఉంటుంది. మహేశ్‌బాబు 'దూకుడు'లో తండ్రి ఎమోషన్‌ను కనిపిస్తే.. ఇందులో ఓ పాప ఎమోషన్ కీలకంగా నిలుస్తుంది. మిగతాదంతా శ్రీను వైట్ల మార్క్ వినోదం.. గోపీచంద్ శైలి యాక్షన్ హంగామాతో రొటీన్‌గానే సాగిపోతుంది. ద్వారకలో జరిగే బాంబు బ్లాస్ట్ ఎపిసోడ్‌తో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే జలాలుద్దీన్ పాత్రను పరిచయం చేసి నేరుగా కథలోకి తీసుకెళ్లిపోయారు దర్శకుడు. కథలో సీరియస్‌నెస్ మిస్సయి పోతుంది. ఇక్కడి నుంచి శ్రీను వైట్ల మార్క్ వినోదం మొదలవుతుంది. జాలిబాబుగా పృథ్వీ చేసే అల్లరి.. మ్యారేజ్ బ్రోకర్‌గా శ్రీనివాస్ కామెడీ ట్రాక్ ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయి. ఇక నాయకా నాయికల మధ్య వచ్చే ఇటలీ లవ్‌ట్రాక్ ఎపిసోడ్ బోరింగ్‌గా అనిపిస్తుంది. పాపను చంపేందుకు బాచిరాజు మళ్లీ కుట్ర మొదలు పెట్టినప్పటి నుంచి కథలో సీరియస్‌నెస్ మొదలవుతుంది. ఈ క్రమంలో గోవా నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌తో విరామమిచ్చిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. గోపీచంద్ ఎప్పటిలాగే తనకు అలవాటైన యాక్షన్ పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. యాక్షన్, కామెడీ సీక్వెన్స్‌లలో తనదైన శైలిలో చెలరేగి పోయారు. కావ్య థాపర్ తెరపై తన అందచందాల తో గ్లామర్‌గా కనిపించింది. తన పాత్ర నిడివి కూడా ఎక్కువగా ఉంటుంది. డ్యాన్సుల్లో ప్రతిభ చూపే అవకాశం దొరికింది. కాకపోతే నటన పరంగా ప్రతిభ చూపించుకునే ఛాన్స్ దొరకలేదు. ప్రధాన ప్రతినాయకుడిగా జిషు సేన్ గుప్తా అలవాటైన విలనిజంతో ఆకట్టుకున్నాడు. సునీల్‌ను ఒకటి రెండు సీన్స్ మినహా ఆద్యంతం కామెడీ విలన్‌గానే చూపించారు. ఈ కథకు కీలకమైన దర్శన పాత్రను పోషించిన చిన్నారి చక్కటి నటనతో ఆకట్టుకుంది. నరేశ్, ప్రగతి, వెన్నెల కిషోర్, పృథ్వీ, వీటీవీ గణెళిశ్, అజయ్ ఘోష్.. ఇలా బోలెడంత మంది కమెడియన్లు కనిపించారు. వీరిలో ప్రతి ఒక్కరూ వాళ్ల పాత్ర పరిధి మేరకు నవ్వించే ప్రయత్నమే చేశారు. కమర్షియల్ డైరెక్టర్‌గా శ్రీను వైట్ల ప్రతిభకు వంక పెట్టాల్సిన పనిలేదు. కాకపోతే తన రొటీన్ కమర్షియల్ ఫార్మాట్ నుంచి బయట పడటం లేదు. రచయిత గోపీమోహన్ కూడా ఒకే థీమ్‌ను పట్టుకుని బండి నడిపిస్తున్నట్లు అనిపిస్తోంది. కథ.. కథనాల్లో కొత్తదనం చూపించలేకపోతున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం పర్వాలేదనిపిస్తుంది. భీమ్స్ చేసిన 'గుంగురూ గుంగురూ' పాట మాస్ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. ఇలాంటి రొటీన్ కథను నమ్మి భారీగా ఖర్చు పెట్టిన నిర్మాతల సాహసాన్ని మెచ్చుకోవాలి.

# స్వయంభూ సెట్‌లో.. ఆయుధపూజ




నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. భారీ బ్జడెట్‌తో ప్రతిష్మాత్మకంగా చిత్రబృందం దీనిని రూపొందిస్తోంది. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని తాజాగా ఈ సినిమా సెట్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. సినిమాలో ఉపయోగిస్తోన్న ఆయుధాలన్నింటికీ పూజ చేశారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. దసరా శుభాకాంక్షలు తెలియజేసింది.

# దేవర-2 మరికొందరు బాలీవుడ్ స్టార్స్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీని సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు. ఇది జరుగుతుందో, లేదో నాకు తెలియదు కానీ.. 'దేవర2'లో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుంటుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఇది జరుగుతుందో, లేదో తెలియకుండా నేను ఎక్కువ వివరాలు పంచుకోకూడదు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయి. 'దేవర2'లో అతిథి పాత్రలు కూడా ఉంటాయి. అవి సినిమాలో చాలా కీలకమైనవి. అతి త్వరలోనే వాటి వివరాలు ప్రకటిస్తాను అని కొరటాల శివ అన్నారు.'దేవర 2'పై కొరటాల ఎప్పటికప్పుడు అంచనాలు పెంచేస్తున్నారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఇటీవల వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు .ఎన్టీఆర్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందన్నారు.


# పట్టాలకు ఎక్కని వేణు మూవీ

## -దిల్‌రాజ్ దయతలిస్తేనే ముందుకు...



నటుడిగా, కామెడీయన్‌గా మంచి గుర్తింపు పొందిన ఆర్టిస్ట్ వేణు యేల్దండి. జబర్దస్త్ షోతో స్టార్ కామెడీయన్‌గా ఎదిగిన వేణు.. 'బలగం' సినిమా తీసి అందరిని ఆశ్చర్యపరిచాడు. తెలంగాణ మాండలికం, ఎమోషనల్ స్టోరీ నేరేటివ్‌తో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలని కట్టిపడేసాడు. దీంతో ఆయన నెక్స్ట్ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సినిమా రిలీజై రెండేళ్లవుతున్నా.. ఇంకో ప్రాజెక్ట్ షూట్ ప్రారంభించకపోవడంతో అసలేమైందని చర్చ జరుగుతోంది. కథను ఇప్పటికే ఇద్దరు స్టార్ హీరోలకు నేరేట్ చేసిన వాళ్ళమేన్నారు.. ప్రొడ్యూసర్ దిల్ రాజు ఏమన్నాడంటే.. వేణు యేల్దండి.. తన బలగం సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలో సంచలనమే సృష్టించాడు. ఈ సినిమాకి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన దిల్ రాజే నెక్స్ట్ సినిమాకి కూడా కమిట్మెంట్ ఇచ్చాడు. దీంతో 'ఎల్లమ్మ' కథ ఆధారంగా వేణు ఒక స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నాడు. మొదట ఈ స్టోరిని నేచురల్ స్టార్ నాని కి నేరేట్ చేసినట్లు వార్తలొచ్చాయి. అయితే కథ నచ్చకో, డేట్స్ కాళీలేకో నాని ఈ సినిమాని యాక్సెప్ట్ చేయలేదని టాక్ వినపడింది. బేసిక్‌గా ప్రయోగాత్మక, ఉత్తమ కథాదీరిత సినిమాలు చేసే నాని ఇలా చేశాడేంటని అంతా అనుకున్నారు. దీంతో వేణు ఈ కథను హీరో నితిన్‌కి వినిపించారట. స్టోరీ నచ్చిన నితిన్ ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాడని కూడా సినీ వర్గాల్లో టాక్. బేసిక్‌గా దిల్ రాజు ప్రొడక్షన్ అంటే నితిన్ నో చెప్పే ఛాన్సే లేదంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం జరిగిన ఓ సినిమా మీటింగ్‌కి డైరెక్టర్ వేణుతో పాటు నిర్మాత దిల్ రాజు కూడా అటెండ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో దిల్ రాజు మాట్లాడుతూ.. ' ఏం వేణు ఎల్లమ్మ కథ ఎప్పుడు మొదలు పెడుతున్నావు' అని ప్రశ్నించాడు. దీనికి వేణు స్పందిస్తూ.. మీరెప్పుడంటే అప్పుడే సార్ అన్నారు. ఈ నవంబర్‌లో షూట్ స్టార్ట్ చేద్దామా అన్నారు. దీనికి దిల్ రాజు నవ్వుతూ.. వద్దు ఫిబ్రవరిలో స్టార్ట్ చేద్దాము అంటూ సమాధానమిచ్చారు. దీంతో అనఫీషియల్‌గా ఈ ప్రాజెక్ట్‌కి హీరో సెలెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాబిన్‌హుడ్, తమ్ముడు సినిమాలతో బిజీగా ఉన్న నితిన్ ఈ ప్రాజెక్ట్ చేయనున్నట్లు టాక్.

# హీరోయిన్‌తో ప్రేమలో పడ్డ నారా రోహిత్




తొలి సినిమా 'బాణం'తోనే ప్రేక్షకులని ఆకట్టుకున్న హీరో నారా రోహిత్. ప్రతినిధి సినిమాతో ఆడియెన్స్‌కి మంచి కిక్కిచ్చిన రోహిత్.. ఆ మూవీ సీక్వెల్ ప్రతినిధి 2తో మాత్రం నిరాశపరిచాడు. ఇదంతా పక్కన పెడితే ఇండస్ట్రీలోని మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో రోహిత్ ఒకరు. తాజాగా ఆయన పెళ్ళికి సంబంధించిన అప్డేట్ ఒకటి సందడి చేస్తుంది. అది కూడా ఒక హీరోయిన్‌ని ప్రేమించి పెళ్లిచేసుకోనున్నట్లు సమాచారం. సాక్షాత్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడి కుమారుడైన రోహిత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలతో ఫర్వాలేదనిపిస్తునాడు. భారీ హిట్లు లేకపోయినా డిజాస్టర్ కథలు కూడా తీయకపోవడంతో కెరీర్ సాఫీగానే సాగుతోంది. అయితే వయసు మాత్రం నాలుగు పదులు దాటడంతో పెళ్లి చేసేయాలని నారా ఫ్యామిలీ ఫిక్స్ అయిపోయిందంట. అంతే కాదు త్వరలోనే పెళ్ళికి ముహర్తం కూడా ఫిక్స్ చేశారు. ఈ నెల 13నే ఎంగేజ్మెంట్. ప్రతినిధి 2 సినిమాలో హీరోయిన్‌గా చేసిన 'సిరి' ని రోహిత్ ప్రేమించాడట. ఈ జంట పెళ్లి చేసుకోవడానికి కూడా సిద్దపడటంతో వధువుని ప్రత్యేకంగా వెతికే పని లేకుండా చేశావు అంటూ నారా ఫ్యామిలీ ఖుషి అవుతోంది. ప్రస్తుతం ఈయన ప్రతినిధి 2 సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. టీజర్, ట్రైలర్‌లతోనే మంచి హైప్ తెచ్చుకున్న ఈ మూవీ కొన్నాళ్లు చర్చల్లో బాగా నిలిచింది. అయితే సీఎం మరణం.. అతని కొడుకుని సీఎం చేయాలని పట్టుబట్టడం.. సంక్షేమ పథకాలపై సెటర్లు.. అభివృద్ధి జరగలేదనే విమర్శలు.. ఇవన్నీ అధికార వైసీపీ పార్టీకి కనెక్ట్ అయ్యే అంశాలుగా ఉన్నా.. కథ పరంగా ఆ పార్టీని కెలికే ప్రయత్నం అయితే చేయలేదు. కేవలం సీఎం మర్డర్ మిస్టరీ చుట్టూ పొలిటికల్ డ్రామా మాత్రమే చూపించారు.